విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



శంకర్‌రాథోడ్

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. ఈ నెల 21న తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందన్నారు. మనబడిలో ఆహారోత్సవం పేరుతో పౌష్టికాహారంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎప్పటికప్పుడు పేరెంట్స్ కమిటీతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు.

వేగవంతంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సిబ్బందికి సూచనలు చేస్తున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధి 11వ డివిజన్‌లోని దర్గాఖలీజ్‌ఖాన్, 19వ డివిజన్‌లోని అభ్యుదయనగర్, 20వ డివిజన్‌లోని కాళీమందిర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిల్‌కలెక్టర్లు మహిపాల్‌రెడ్డి, పూర్ణ, సైదులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే తనిఖీ



సర్వేను పరిశీలిస్తున్న వెంకన్న, రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ ప్రాంతంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల అదృశ్యం



సత్యభామ



భారతి

మైలార్‌దేవ్‌పల్లి: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మధుబన్ కాలనీకి చెందిన శరత్‌మోహన్, సత్యభామ(22) భార్యాభర్తలు. వీరికి అబ్బాయి, ఓ కూతురు ఉన్నారు. ఈ నెల 15న సత్యభామ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శరత్ మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన ఈశ్వర్‌రావు, భారతి(28) భార్యాభర్తలు. వీరికి ధనుష్(7), పూర్ణచందర్(8) సంతానం. ఈ నెల 14న పనికి వెళ్లిన ఈశ్వర్‌రావు రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి భారతి ఇద్దరు పిల్లలు కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గోల్కొండ: అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సరైన ధ్రువపత్రాలతో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే వారందరికీ చెక్కులు మంజూరవుతాయన్నారు. మరింత సమాచారం కోసం తన కార్యాలయంలో నేరుగా తనను గానీ, తన సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఆలీముద్దీన్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులున్నారు.

మా పనులు లేకుండా తీర్మానం ఎలా చేస్తాం?

- సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు
- అడిగిన పనులేవని నిలదీత
- ఈ నెల 27వ తేదీకి వాయిదా



కౌన్సిల్ సమావేశంలో పనులపై నిలదీస్తున్న కౌన్సిలర్లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే కొనసాగుతున్న పనులు, పూర్తయిన వాటికి బిల్లులు చెల్లించకుండా.. ఎప్పటి నుంచో పెండింగ్ పెట్టి ఇప్పుడు ఉన్న డబ్బంతా చెత్త తరలింపుకే కేటాయించటం ఏంటని కౌన్సిలర్లు ప్రశ్నించారు. తమ వార్డుల్లో చేయాల్సిన అనేక అభివృద్ధి పనులపై ప్రజలకు హామీలు ఇచ్చామని, వాటి అంశాలు లేకుండానే ఎజెండా ఎలా తయారు చేశారన్నారని నిలదీశారు. తమ వార్డులలో తాము కోరిన పనులన్నింటినీ చేర్చి ఎజెండా తయారు చేస్తేనే తాము వాటికి తీర్మానం చేస్తామన్నారు. ప్రస్తుత సమావేశంలో పెట్టిన ఏ ఒక్క అంశాన్నీ తాము అంగీకరించి తీర్మానం చేయమని తేల్చి చెప్పారు. దీంతో చేసేదేమీ లేక మున్సిపల్ సమావేశాన్ని ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసుకున్నారు.

ముందే చెప్పిన 'సాక్షి'..

మణికొండ మున్సిపాలిటీలో ఉన్న రూ. 25 కోట్ల నిధులను ప్రాధాన్య క్రమంలో ప్రస్తుతం కొనసాగుతున్న, నిలిచిపోయిన పనులకు కేటాయించకుండా కేవలం చెత్త తరలింపుకే రూ.19.81 కోట్లు, జలమండలికి రూ. 2.25 కోట్లను కేటాయించారు. అత్యవసరంగా పూర్తి చేయాల్సిన మున్సిపల్ నూతన కార్యాలయం, కమ్యూనిటీహాళ్లు, పార్కుల అభివృద్ధి, క్రీడా ప్రాంగణం, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ తదితర పనులకు నిధులు కేటాయింపులో ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదు. మున్సిపాలిటీ పాలకవర్గానికి ఇది చివరి సమావేశం కావటంతో వార్డులలో ఉన్న అన్ని పనులకు తీర్మానాలు చేసి పెడితే రాబోయే రోజుల్లో వచ్చే అధికారుల పాలనలో వాటిని అమలు చేసుకునే వీలుంటుంది. ఇదే విషయాన్ని 'సాక్షి' లో 'కేవలం చెత్తకే బడ్జెట్' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో కౌన్సిలర్లు తమ వార్డులలో తాము కోరిన పనుల జాడ ఎజెండాలో లేకపోవటంతో సమావేశాన్ని వ్యతిరేకించి వాయిదా వేయించారు.

సభ్యులంతా ఏకతాటిపై నిలిచి..

మణికొండ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం గురువారం చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించాలని నిర్ణయించి అందరూ ఉదయం 11 గంటలకు సమావేశ మందిరానికి చేరుకున్నారు. అనంతరం తాము సూచించిన ఏ ఒక్క పనిని ఎజెండాలో పెట్టకపోవటంతో ఆగ్రహానికి గురయ్యారు. కేవలం చెత్త తరలింపు, జలమండలికి మాత్రమే ఉన్న నిధులు కేటాయిస్తే మిగతా పనుల సంగతేంటని ప్రశ్నించారు. సభ్యులంతా ఏకతాటిపై నిలిచి ప్రశ్నించటంతో పరిస్థితి తీవ్రతను గమనించిన చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఎజెండాలో కౌన్సిలర్లు కోరిన అన్ని పనులను చేర్చాలని, ప్రస్తుత ఉన్న బడ్జెట్ ప్రకారం నిధులను కేటాయించి మిగతా పనులను రాబోయే అధికారుల పాలన, జీహెచ్‌ఎంసీ పాలనల్లో ఏది వస్తే వారి ద్వారా పనులు చేయించే వీలు భావించి సమావేశాన్ని ఈనె ల 27వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

రూ. 100 కోట్ల పనులు ఉన్నాయి..

మున్సిపాలిటీ పరిధిలో నిధులు రూ.25 కోట్ల వరకు ఉండగా పనులు మాత్రం వంద కోట్లకు పైగానే ఉన్నాయి. ఇప్పటికే పూర్తయిన పనులకు రూ. 26 కోట్లు చెల్లించాల్సి ఉంది. పనులు పూర్తయిన వాటికి రూ.18 కోట్ల వరకు బిల్లులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం పనులు కొనసాగుతున్న వాటికి రూ.17.50 కోట్లు ఉండగా జరిగి పనులు మొదలు పెట్టాల్సినవి రూ. 11,70 కోట్లు ఉన్నాయి. ప్రస్తుతం కౌన్సిలర్ల వారీగా పనులు కావాలని అడిగినవి మరో రూ. 25 కోట్ల వరకు ఉన్నాయి. ఉన్నతాధికారుల నుంచి మున్సిపాలిటీలో ఉన్న నిధుల మేరకే తీర్మానాలు చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. రాబోయే సమావేశంలో అన్నింటినీ చేర్చి ఎజెండాను తయారు చేస్తాం.

–డి.ప్రదీప్‌కుమార్,
కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ

సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలి



బూత్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న మల్లారెడ్డి

అత్తాపూర్: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ సుభాష్‌చంద్రబోస్ బస్తీలోని బూత్ నెంబర్ 207లో బూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాకేష్, సెక్రటరీగా ధనంజయ్ నియమితులయ్యారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీలో కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమురయ్య, జయానందర్‌రెడ్డి, చంద్రపాల్, ఎస్.రమేష్, శ్రీకాంత్, ఆర్.జగన్, బి.భరత్, వినయ్, అఖిల్ పాల్గొన్నారు.

22న ఉచిత లీగల్ ఎయిడ్ క్లినిక్

నాంపల్లి: బజ్‌మే కక్షాన్ లిటరరీ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న లీగర్ ఎయిడ్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, న్యాయవాది మహ్మద్ అసద్ అలీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మల్లేపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. అఫ్జల్ సాగర్ మహమూద్ ఆసుపత్రి సమీపంలోని మదీనా టవర్ మూడవ అంతస్తులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 8 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. లీగల్ నోటీస్, గిఫ్ట్‌డీడ్, సేల్ డీడ్, వీల్‌డీడ్, పార్టీషన్ సూట్, జీపీఏ, మెయింటెనెన్స్, మెటర్నటీ బెనిఫిట్స్, డొమెస్టిక్, డైవర్స్ ఖులా, సర్వీస్ మ్యాటర్, ఆన్‌లైన్ ఫ్రాడ్ కేసులకు సంబంధించి న్యాయ సహాయం చేస్తారని తెలిపారు. వివరాలకు 99596 72740లో సంప్రదించాలని సూచించారు.

మైనర్‌ను తీసుకెళ్లేందుకు సహకరించిన వ్యక్తి రిమాండ్

జియాగూడ: మైనర్ బాలికను తీసుకెళ్లడానికి స్నేహితుడికి సహకరించిన ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్, ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు. గత నెల 30న పురానాపూల్ ప్రాంతంలో ఉప్పుగూడకు చెందిన ప్రవీణ్(21) బ్యాండ్ వాయిస్తుంటాడు. ఇతడు ఓ మైనర్ బాలికను తీసుకువెళ్లడానికి సహకరించిన వనపర్తికి చెందిన కె.భానుప్రకాష్(21) సహకరించడంతో గురువారం వనపర్తిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఫిల్మ్, ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలో

విజయం సాధించాలంటే నైపుణ్యం అవసరం

టీహబ్ సీఈఓ సుజిత్ జాగీర్దార్

రాయదుర్గం: ఫిల్మ్, ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలో విజయం సాధించాలంటే నైపుణ్యం ఎంతో ముఖ్యమని టీహబ్ సీఈఓ సుజిత్ జాగీర్దార్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో ఫిల్మ్ ఎడ్యుకేషన్‌లో అగ్రగామి 'మీ స్కూల్' ద్వారా సినీప్రెన్యూర్ ప్రోగ్రామ్ కోహర్ట్–5ను ప్రారంభించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీ స్కూల్ సృజనాత్మకతను పెంపొందించడంలో ముందంజలో ఉందన్నారు. సినీప్రెన్యూర్ ప్రోగ్రామ్ వారి అంకితభావానికి నిదర్శనమన్నారు. మీ స్కూల్' వ్యవస్థాపకులు ప్రతిభ పులిజాల మాట్లాడుతూ క్రియాశీల ప్రతిభను పెంపొందించడంలో, ఆశాజనకమైన చిత్ర నిర్మాతలు, సృజనాత్మక వ్యాపారవేత్తలు వారి కలలను నెరవేర్చడంలో ముందుకుసాగుతున్నామన్నారు డీఓపీ డైరీస్ అనే పాడ్‌కాస్ట్ సిరీస్‌ను ప్రవేశపెట్టడం గర్వంగా ఉందన్నారు. కాగా తెలంగాణ రాష్ట్ర తొలి మహిళా సినిమాటోగ్రాఫర్ విజయక్ష డీఓపీ డైరీస్ ప్రారంభ ఎపిసోడ్‌ను హోస్ట్ చేయడం విశేషం, ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు పిజివిందా, మాజీ నిర్మాత పరుశురామ్, టీహబ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, విద్యార్థులు, టీహబ్, మీస్కూల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



టీహబ్‌లో మీ స్కూల్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందిస్తున్న సుజిత్‌జాగీర్దార్, స్కూల్ ప్రతినిధులు

'మనూ' అసిస్టెంట్ ప్రొఫెసర్ సబాఖాతూన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సబాఖాతూన్‌కు గురువారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆంగ్ల విభాగంలో ప్రొఫెసర్ కొత్తచెరువు నాగేంద్ర పర్యవేక్షణలో 'ఇంటిగ్రేషన్ ఆఫ్ ఐసీటీ ఇన్ ఇంగ్లిష్ టీచింగ్ ప్రాక్టీస్ :యాన్ అసెస్‌మెంట్ ఆఫ్ ఉస్మానియా యూనివర్సిటీ బీఈడీ ప్రోగ్రామ్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఆమెను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ అభినందించారు.

పెనుగొండకు అవార్డు రావడం హర్షణీయం

చార్మినార్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడంపై హైదరాబాద్ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు సూర్య ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా నూజండ్ల మండలం చెరువు కొమ్ముపాలెంలో జన్మించారని, గుంటూరులో న్యాయవాద వృత్తి కొనసాగిస్తున్నారన్నారు. వీరు 1972 నుంచి అరసంలో అనేక బాధ్యతలు నిర్వహించి, 2023లో అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారన్నారు. 1972లో సమిధ అనే కవితతో రచన ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. వీరు రచించిన దీపిక పుస్తకానికి పురస్కారం లభించడం అభ్యుదయ రచయితల సంఘానికి గర్వకారణమన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

యాకుత్‌పురా: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంతో ఆర్థికంగా నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంబీటీ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ మహ్మద్ అంజాదుల్లా ఖాన్ అన్నారు. యాకుత్‌పురా ఈస్ట్ చంద్రనగర్‌లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించిన బాధిత కుటుంబ సభ్యులను గురువారం ఆయన నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈస్ట్ చంద్రనగర్‌లో నివాసముండే జమీర్, షేహనాజ్ అహ్మదీ దంపతుల ఇంట్లో ఈ నెలా 17న రాత్రి ఒంటి గంట సమయంలో ఫ్రిడ్జ్ నుంచి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పాడి అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన జమీర్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు.



క్రిస్మస్ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలోని ఎయిర్‌పోర్టు విలేజ్‌లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ గ్రీటింగ్ అలంకరణ అందరిని ఆకట్టుకుంటోంది. క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్‌తో పాటు గిఫ్ట్ ప్యాక్‌లు ఏర్పాటు చేశారు. –శంషాబాద్

భక్షికుంట అభివృద్ధికి వినతి

శేరిలింగంపల్లి: చందానగర్ భక్షికుంట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గురువారం జోనల్ కమిషనర్‌ను బీజేపీ నాయకులు కోరారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొంతమేర అభివృద్ధి చేశారని, దీంతో పరిసర కాలనీలవాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తున్నారని తెలిపారు. కాగా ఈ సీజన్‌లో కురిసిన వర్షాలకు చెరువు నిండింది. దీంతో వాకింగ్ వచ్చే మహిళలు, చిన్నపిల్లలు అటు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, పాముల బెడద ఉందని వివరించారు. భక్షికుంట చెరువు చుట్టూ ఫెన్సింగ్, స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

రహదారులపై చెత్త వేయొద్దు



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇళ్లలో పోగయ్యే చెత్తను రహదారులపై వేయకుండా, ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ కార్మికులకే అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 1వ డివిజన్ కేకేనగర్ ఫేస్–2, 2వ డివిజన్‌లోని గంధంగూడ, 3వ డివిజన్‌లోని మాధవీనగర్ కాలనీల్లోని పారిశుద్ధ్య పనులు గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు రామంజులు, మల్లేష్, నరేందర్, రాము పాల్గొన్నారు.

హాకథాన్‌లో ఎంజీఐటీ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మణికొండ: సౌర విద్యుత్ ఉత్పత్తిలో సూర్యభ్రమణానికి అనుగుణంగా సోలార్ ప్యానెల్స్‌ను తిప్పే పరికరాన్ని అతి తక్కువ ఖర్చుతో తయారు చేసి గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించారు. భారత శాస్త్రీయ, సాంకేతిక విభాగం వారు అఖిల భారత స్థాయి హాకథాన్–2024ను కొయంబత్తూరులోని ఫోర్జ్ ఇన్నోవేషన్, వెంచర్స్‌లో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించారు. ఎంజీఐటీ కళాశాలకు చెందిన మెకట్రానిక్స్ విభాగానికి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో భాగంగా ఇచ్చిన సమస్యకు అనుగుణంగా ఉత్పత్తిని తయారు చేసి సత్తా చాటారు. గురువారం కళాశాలకు చేరుకున్న విద్యార్థులు పి.చాణిక్య, పి. ఆదిత్యరాజ్, వి.అనురాగ్ నాయుడు, వి. ప్రసన్న, ఎం.కార్తిక్, ఎస్. ప్రణయ్‌ను ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె. సుధాకర్‌రెడ్డి అభినందించారు.విద్యార్థులు రూ. లక్ష బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నారని ఆయన వివరించారు.

స్వచ్ఛభారత్‌లో నార్సింగికి అవార్డు



అవార్డును అందుకున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు, తడి,పొడి చెత్త సేకరణ, ఎరువుల తయారీ, కాలుష్య నియంత్రణకు కృషి చేయటం తదితర అంశాల్లో నార్సింగి మున్సిపాలిటీకి జాతీయస్థాయి అవార్డు దక్కింది. స్వచ్ఛభారత్ మిషన్–2.0లో భాగంగా గురువారం ఢిల్లీలో చేంజ్ మేకర్స్ కాంక్లేవ్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల పక్కన చెత్త లేకుండా, షాపులు, గృహాల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించటం, దానితో మొక్కలకు ఉపయోగపడే ఎరువును తయారు చేయటం చేస్తున్నామన్నారు. అలాంటి చర్యలతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని, అదే విషయాన్ని కాంక్లేవ్‌లో ప్రదర్శించడంతో అనేక మంది అభినందించారన్నారు. దేశ వ్యాప్తంగా వందలాది మున్సిపాలిటీలు పలు రంగాల్లో సాధించిన ప్రగతిని వివరించాయని, అందులో రాష్ట్ర వ్యాప్తంగా 17 మున్సిపాలిటీలకు అవార్డులు దక్కాయన్నారు. జిల్లాలో ఆదిభట్ల, తుర్కయంజాల్‌కు అవార్డులు వచ్చాయన్నారు. రాబోయే రోజుల్లో పారిశుద్ధ్యంపై మరింత దృష్టి పెట్టి స్వచ్ఛ నార్సింగిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న శ్రీనివాస్

శంషాబాద్: ప్రస్తుత సమాజంలో ప్రతి రంగంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా మారిందని మోర్ట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో సీఎస్‌సీ అకాడమీ ఆధ్వర్యంలో కంప్యూటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు నిర్వాహకులు జాఫర్‌అలీతో కలిసి ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి అవకాశాలను కల్పించే కంప్యూటర్ పరిజ్ఞానం నేర్పించేందుకు సీఎస్‌సీ అకాడమీ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. కార్యక్రమంలో మహ్మద్ అస్లాం, ప్రశాంత్, ప్రియాంక శ్రీవాత్సవ, శ్రీదేవి, శివకుమార్, జుబేర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



నల్లగండ్ల హుడా కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా కాలనీలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి గురువారం పర్యటించారు. కాలనీవాసులు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ హుడా కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, డ్రైనేజీ లైన్లను ప్రణాళిక బద్ధంగా ఏర్పాటు చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ల డయా పెంచడంతో పాటు లెవల్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జలేందర్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల అందజేత



గుర్తింపు కార్డులను అందజేస్తున్న పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నారాయణ

చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేయాలనే దృఢ సంకల్పంతో అమ్మ ఆదర్శ పాఠశాల అనే కార్యక్రమం ద్వారా చాంద్రాయణగుట్టలోని ప్రభుత్వ పాఠశాలను సుందీకరించింది. పాఠశాలకు అవసరమైన మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, పాఠశాలకు పెయింటింగ్, విద్యార్థినీ, విద్యార్థులకు నూతన ఫర్నీచర్‌ను అందించి పాఠశాల విద్యను బలోపేతం చేస్తున్నారు. పాతబస్తీలోని ప్రభుత్వ పాఠశాలకు మొట్టమొదటిసారిగా విద్యార్థులకు గుర్తింపు కార్డులు ఉండాలనే దృఢ సంకల్పంతో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.నారాయణ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ డిప్యూటీ ఐఓఎస్ ఎస్.లక్ష్మణ్ సింగ్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీను నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.